క్లుప్తంగా

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి, నాయకులు

కొత్తూరు: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో గురువారం మల్లికార్జునస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయానికి ఆయన రూ.1 లక్ష 16 వేలు విరాళం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, ఆగీరు రవికుమార్‌గుప్తా, నర్సింహారెడ్డి, శ్రీరాములు, దశరథ్‌నాయక్, మహేశ్, శ్రీశైలం యాదవ్, శేఖర్, రాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం రావిర్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని వీరసముద్రంలో గురువారం దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అర్చకుడు ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య సీతారామస్వామి, శివగింగం, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, నాభిశిల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు దాన్యధివాసం, జలాధివాసం, శయ్యాధివాసం నిర్వహించడంతో పాటు ప్రత్యేక హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

నిధులు లేక.. పనులు సాగక

- అర్ధంతరంగా నిలిచిన మార్కెట్‌యార్డు నిర్మాణ పనులు
- పిల్లర్ల దశలోనే దర్శనమిస్తున్న వైనం
- రోడ్డుపక్కనే చిరు వ్యాపారుల విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



పిల్లర్ల దశలో నిలిచిన మార్కెట్ నిర్మాణం

కొత్తూరు: చిరువ్యాపారులకు అనుకూలంగా సువిశాలమైన స్థలంలో కూరగాయలు, మాంసహారం, పూలు, పండ్ల దుకాణాలను ఒకేచోట నిర్వహించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్‌యార్డుల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. నిధుల లేమి, ప్రభుత్వాలు మారడంతో చాలా చోట్ల మార్కెట్ భవనాల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి.

రూ.2కోట్లతో..

కొత్తూరులో 2022లో సుమారు రూ.2కోట్లతో సమీకృత మార్కెట్ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. పిల్లర్ల వరకు పనులు రాగానే నిధుల లేమి, ప్రభుత్వాలు మారడంతో పనులు నిలిచిపోయాయి. మూడేళ్లుగా మార్కెట్ నిర్మాణ పనులను అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో ముందుకు సాగడం లేదు.

సుమారు 20 వేలకుపైగా జనాభా

కొత్తూరు పట్టణంలో సుమారు 20 వేలకు పైగానే జనాభా ఉన్నారు. జనాభాకు తగ్గట్లుగా స్థానికంగా మార్కెట్లు లేవు. దీంతో వందల సంఖ్యలో చిరు వ్యాపారులు జేపీదర్గా, పెంజర్ల, పాత పంచాయతీ రోడ్లకు ఇరువైపులా కూరగాయలు, పూలు, పండ్లు, మాంసహార దుకాణాలను నిర్వహిస్తున్నారు. రోడ్లపై నుంచి రాకపోకలు కొనసాగించే వాహనాల



రోడ్డు పక్కనే కూరగాయలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

సంఖ్య అధికంగా ఉండడంతో విపరీతమైన దుమ్ము వెలువడుతోంది. దీని కారణంగా ప్రజలు కొనుగోలు చేస్తున్న కూరగాయలు, మాంసహారం, పండ్ల కారణంగా వారి ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. దానికి తోడు చిరు వ్యాపారులు ప్రధాన రోడ్లకు ఇరువైపులా వ్యాపారాలను కొనసాగిస్తుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు నెలకొంటున్నాయి.

వ్యాపారులకు తప్పని తిప్పలు

మార్కెట్లు అందుబాటులో లేకపోవడంతో చిరు వ్యాపారులు, ప్రజలు కాలకృత్యాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారుతోంది. సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయితే అందులో టాయిలెట్స్, వ్యాపారులకు కేటాయించే స్థలం ఇతర సదుపాయలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా స్వచ్ఛమైన వాతావరణంలో అహార ఉత్పత్తులను విక్రయిస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడుకోవచ్చని పలువురు పేర్కొంటున్నారు.

“ నిధుల లేమితోనే..



కొత్తూరు పట్టణంలో 2022లో సుమారు రూ.2 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. నిధుల లేమి కారణంగా పనులు గత మూడేళ్లుగా నిలిచిపోయాయి.

– బాలాజీ, మున్సిపల్ కమిషనర్

మున్సిపాలిటీల అభివృద్ధికి చర్యలు

మున్సిపల్ కమిషనర్ సునీత



న్యూసిటీ కాలనీ పార్కులో మొక్క నాటుతున్న మున్సిపల్ కమిషనర్ సునీత, నాయకులు, సిబ్బంది

షాద్‌నగర్: మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మున్సిపల్ కమిషనర్ సునీత అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పట్టణంలోని 27వ వార్డు న్యూసిటీ కాలనీలో ఉన్న పార్కులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపాలిటీలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని, ఇందులో భాగంగా వందరోజుల ప్రణాళిక ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తి నిషేధించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను అందరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య సిబ్బందికి ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



వైద్య శిబిరం వద్ద ప్రజలు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో గురువారం ఆమనగల్లు ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యాధికారి డాక్టర్ మంజుల దేవి, డాక్టర్లు రచనాసింగ్, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో 198 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 10 మందికి ఎక్సరే, 72 మందికి బీపీ, మధుమేహ పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది వేణు, నాగేశ్వరి, విజయ్ కుమార్, అలీం, భారతమ్మ, గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దేవాలయ వార్షికోత్సవాలు



అయ్యప్పస్వామి దేవాలయం

శంకర్‌పల్లి: పట్టణంలో గల అయ్యప్పస్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవాలు ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలకు గాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. 6వ తేదీ శుక్రవారం గణపతిపూజ, అఖండ దీపారాధన, ధ్వజారోహనం, క్షేత్ర పాలక దేవతారాధన, శనివారం అవాహిత దేవతారాధన, అగ్ని మధనం, అగ్ని ప్రతిష్ట, మూలమంత్ర హోమం, శత కలశ స్థాపనం, ఆదివారం పూర్ణాహుతి, క్షేత్రపాలక బలి, శత కలశాభిషేకం, చక్రతీర్థం, కలశ ఉద్వాసనం కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రతీ రోజు పాటు అన్నప్రదానం అందిస్తామని, పట్టణంతో పాటు చుట్టు పక్కన గ్రామాల ప్రజలు హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో, రోడ్ల వెంబడి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పలువురు పిలుపునిచ్చారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు.



చేవెళ్ల: కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న న్యాయవాదులు

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, వాటితోనే మానవాళి మనుగడ సాధ్యమని చేవెళ్ల సీనియర్ సివిల్ జడ్జి దశరథ రామయ్య అన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో గురువారం జడ్జి ఆధ్వర్యంలో బార్ అసోషియేషన్ సభ్యులందరూ మొక్కలు నాటారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి మహేశ్‌గౌడ్, సీనియర్ న్యాయవాదులు పాండురంగారెడ్డి, బాలస్వామి, నర్సింలు, న్యాయవాదులు రాజశేఖర్, రామకృష్ణ, శివరాజు, రవీందర్, అనంద్, గిరి, విఠల్, అభిలాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ ఆధ్వర్యంలో..

మున్సిపాలిటీలో గురువారం మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపట్టారు. చేవెళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయ పుష్కరిణీ సమీపంలో ప్లాస్టిక్, చెత్తాచెదారాలను తొలగించి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లే మానవాళికి జీవనాధారం



షాబాద్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ అపర్ణ, సిబ్బంది

షాబాద్: పచ్చని చెట్లే ప్రకృతిని సమతుల్యంగా ఉంచుతూ ప్రాణకోటికి జీవనాధారంగా మారతాయని ఎంపీడీఓ అపర్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పామెన నర్సింలు అన్నారు. గురువారం షాబాద్, పోతుగల్ గ్రామాల్లో అధికారులు, నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ వీరాసింగ్, పంచాయతీ కార్యదర్శులు రాధాకృష్ణ, అశోక్, టీఎస్ శివ, పవన్, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొయినాబాద్‌రూరల్: మొక్కలు నాటుతున్న వైద్యాధికారి దేవిరెడ్డి, సిబ్బంది

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని అమ్డాపూర్ పశువైద్యశాల ఆవరణలో సిబ్బందితో కలిసి ఆమె మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడొద్దు



కొత్తూరు: మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, నాయకులు

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. పలు వార్డుల్లో గురువారం ఆమె కౌన్సిలర్లు, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ ఉత్పత్తులను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్ మాదారం నర్సింలుగౌడ్, నాయకులు ఉన్నారు.

భూభారతితో సమస్యల పరిష్కారం

- ఆర్డీఓ సరిత
- రైతుల నుంచి అర్జీల స్వీకరణ



షాద్‌నగర్: మొగిలిగిద్దలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీఓ సరిత

షాద్‌నగర్: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చిందని ఆర్డీఓ సరిత అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద, బూర్గుల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ మేరకు రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాలకు హాజరైన ఆమె మాట్లాడుతూ.. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను తెలుసుకునేందుకు ప్రభుత్వం నేరుగా గ్రామాలకు అధికారులను పంపిస్తోందన్నారు. గ్రామాల్లో రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బూర్గులలో ఉన్న మామిడికుంట చెరువుకు బాట లేకపోవడంతో తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట, బైర్కాన్‌పల్లి గ్రామాల్లో గురువారం తహసీల్దార్ అజాంఅలీ, నాయబ్ తహసీల్దార్ గీత ఆధ్వర్యంలో రెండు టీంలు ఆయా గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేటలో రైతుల నుంచి 10 దరఖాస్తులు, బైర్కాన్‌పల్లిలో 25 దరఖాస్తులు వచ్చాయని అధికారులు వెల్లడించారు. రైతులు అధైర్యపడొద్దని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీనిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు నివేదిత, చెన్నకేశవులు, సీనియర్ అసిస్టెంట్ మచ్చేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

57 ఫిర్యాదులు..

చేవెళ: మండలంలోని న్యాలటలో తహసీల్దార్ కృష్ణయ్య, కమ్మెటలో నాయబ్ తహసీల్దార్ రాజేందర్ ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 57 మంది భూ సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నట్లు తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. న్యాలటలో 25 దరఖాస్తులు రాగా, కమ్మెటలో 32 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, ప్రజలు, రైతులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో 34 దరఖాస్తులు

మొయినాబాద్: మండల పరిధిలోని రెడ్డిపల్లిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతమ్‌కుమార్, సిబ్బంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. 34 మంది రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఏఈఓ సునీల్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: రెవెన్యూ సదస్సులను రైతులు, భూయజమానులు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ సూచించారు. గురువారం మండల పరిధిలోని కేసారం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 45 దరఖాస్తులు రాగా.. 5 దరఖాస్తులను అక్కడే పరిష్కరించి ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. భూ వివాదాల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, మాజీ సహకార సంఘం చైర్మన్ చల్లా రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు చల్లా శ్రీరాంరెడ్డి, సూర్యప్రకాశ్, రైతులు ఉన్నారు.



చేవెళ్ల: న్యాలటలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



షాబాద్: కేసారంలో రైతుకు ప్రొసీడింగ్ అందజేస్తున్న ఆర్డీఓ చంద్రకళ

ఎన్నో ఏళ్ల సమస్యకు పరిష్కారం



శంకర్‌పల్లి: రైతుకు ప్రొసీడింగ్ అందిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి

శంకర్‌పల్లి: రెవెన్యూ రికార్డుల్లో తన కులం పేరు తప్పుగా ఉందని ఎన్నో ఏళ్ల నుంచి ఆఫీసుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేని రైతు అంజయ్యకు గురువారం పరిష్కారం లభించింది. గురువారం మండలంలోని చెందిప్ప గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించగా.. ఇందులో కే.అంజయ్య అనే రైతు తన భూ రికార్డుల్లో కులం ఎస్సీ అని తప్పుగా పడిందని, బీసీ–బీగా మార్చాలని డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి దరఖాస్తు అందించాడు. పరిశీలించిన ఆయన వెంటనే తప్పును సరిచేసి, రైతుకు బీసీ–బీగా ఉన్న ఆర్డర్ కాపీని అందించారు. దీనిపై అంజయ్య స్పందిస్తూ.. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూశానని, ఇలా గ్రామంలోనే పరిష్కారం కావడం సంతోషాన్నిచ్చిందన్నారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మండలంలోని పర్వేదలో 24, చెందిప్పలో 27 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సురేందర్ వెల్లడించారు.

వైద్య శిబిరానికి విశేషస్పందన

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీసాయి ఆప్టికల్స్ ఆవరణలో సికింద్రాబాద్‌లోని పుష్పగిరి కంటి ఆస్పత్రి సహకారంతో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య సహాయకులు కొత్రమల్లేశ్, శ్రావణిలు 174 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, అద్దాలు అందజేశారు. నేత్ర చికిత్స అవసరమని గుర్తించిన 95 మందిని పుష్పగిరి ఆస్పత్రికి పంపించారు.

ధరణితో దోచుకున్నారు

ఇబ్రహీంపట్నం రూరల్: ధరణితో బీఆర్‌ఎస్ నాయకులు సర్వం దోచుకున్నారని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లిలో తహసీల్దార్ సునీతారెడ్డి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు.. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాగన్‌పల్లిలో 297 సర్వే నంబరు సమస్యలపై సమగ్ర విచారణ జరిపించి, సమస్య లేకుండా చేస్తామని హామీనిచ్చారు. అనంతరం లబ్ధిదారు లక్ష్మమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రంలో.. పీహెచ్‌సీ

- సౌకర్యాల ఏర్పాటుకు రూ.20 లక్షలు కేటాయింపు
- భవనాన్ని పరిశీలించిన డీఎంహెచ్‌ఓ



నందివనపర్తి ఆరోగ్య ఉప కేంద్రం

యాచారం: నందివనపర్తిలో పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) ఏర్పాటు కానుంది. దీంతో ఆ గ్రామంతో పాటు అయ్యవారిగూడెం, నస్దిక్‌సింగారం, తాడిపర్తి, కుర్మిద్ద, నానక్‌నగర్, పిల్లిపల్లి, మఱీక్‌గూడ, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ తదితర గ్రామాల ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ కానున్నాయి. అంతే కాకుండా మండల కేంద్రం యాచారం వెళ్లాల్సిన అవసరం ఉండదు. గ్రామంలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని స్థానిక కాంగ్రెస్ నేత బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహకు లేఖ రాసారు. మంత్రి ఆదేశాల మేరకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పీహెచ్‌సీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు.

రూ.20 లక్షల నిధులతో...

ప్రస్తుతం నందివనపర్తిలో కొనసాగుతున్న ఆరోగ్య ఉప కేంద్రం భవనంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయనున్నారు. అందుకు అనుగుణంగా రూ.20 లక్షలతో ఆ భవనాన్ని మరమ్మతు చేయనున్నారు. కావాల్సిన సౌకర్యాలు కల్పించనున్నారు. ఇదిలా ఉండగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఇబ్రహీంపట్నం పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. పీహెచ్‌సీకి కల్పించాల్సిన సౌకర్యాల గురించి చర్చించారు.

యాచారం నుంచి తరలింపు

మండల కేంద్రంలోని ఒకే భవనంలో ప్రస్తుతం వైద్య విధాన పరిషత్ (సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) కొనసాగుతున్నాయి. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఒకే చోట కొనసాగడంతో ఏ శాఖ సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారో తెలియడం లేదు. అంతే కాకుండా ఒకే చోట కాకుండా.. ఇక్కడి నుంచి మరో గ్రామానికి పీహెచ్‌సీని తరలిస్తే.. ఆ పరిసర ప్రాంత ప్రజలకు వైద్య సేవలు చేరువ అవుతాయని భావించారు. ఈ నేపథ్యంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన నందివనపర్తిలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని నిర్ణయించారు. పీహెచ్‌సీ ఏర్పాటు అనంతరం.. యాచారం పీహెచ్‌సీ సిబ్బందినే అక్కడికే తరలించి, ప్రజలకు వైద్య సేవలు అందించేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయనున్నామని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. మరో కొద్ది రోజుల్లో నందివనపర్తిలో పీహెచ్‌సీ సేవలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు.